క్లుప్తంగా

బీఎస్పీకి కొత్త మనోహర్‌రెడ్డి రాజీనామా



రాజీనామా లేఖను చూపిస్తున్న కొత్త మనోహర్‌రెడ్డి

మీర్‌పేట: అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కొత్త మనోహర్‌రెడ్డి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నానని, ఇప్పటివరకు తనకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేవైఎం కన్వీనర్‌గా శివ ప్రకాశ్‌రెడ్డి



మహేశ్వరం: బీజేవైఎం మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్‌గా మండల పరిధిలోని కోళ్లపడకల్ గ్రామానికి చెందిన బీజేపీ యువ నాయకుడు ఐ శివ ప్రకాశ్‌రెడ్డి నియమితులయ్యారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టి యాదిశ్ ఎంపిక చేసి నియమించారు. ఈ సందర్భంగా శివ ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. బీజేపీ సిద్ధాంతాలను యువతకు తెలియజేసి పార్టీ పట్ల ఆకర్షితులను చేసి బలపడేవిధంగా పని చేస్తానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు యాదిష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏబీవీపీలో క్రియాశీలకంగా పని చేసి మహేశ్వరం కన్వీనర్‌గా, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిగా, రాష్ట్ర పార్టీ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహించారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ ,వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో ...రూపాయల్లో...) టమోటా లోకల్ 13, వంకాయ 18, బెండ 40, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్ 20, క్యాబేజీ 19, క్యారెట్ 33. దొండ 23, ఆలు 33, ఉల్లి 19, గోకర 35, దోస 16, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 35, మునగ 21, చిలగడదుంప 65, బీట్‌రూట్ 21, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 65. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

పీహెచ్‌సీని మార్చాలి

కొత్తూరు: ప్రస్తుతం నందిగామ మండలం తాటిగడ్డ తండాలో కొనసాగుతున్న కొత్తూరు పీహెచ్‌సీని మండల కేంద్రానికి మార్చాలని బీజేపీ కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు నాగరాజుచారి గురువారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. మండల కేంద్రానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లేందుకు రోగులతో పాటు సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీని ప్రజలు, రోగుల సౌకర్యార్థం మండల కేంద్రంలోకి మార్చాలని కోరారు.

ప్రతీ ఓటరును కలవాలి

కొందుర్గు: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రతీ ఓటరును కలవాలని జిల్లేడ్ చౌదరిగూడ కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు సూచించారు. గురువారం చౌదరిగూడలో కాంగ్రెస్ ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో పేదలకు న్యాయం జరిగిందని, ఇందిరమ్మ ఇళ్లు, వ్యవసాయ భూములు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. పేదలకు కాంగ్రెస్ అందించిన పథకాలను వివరిస్తే చాలు కాంగ్రెస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట నర్సింహారెడ్డి, శివకుమార్, వీరన్న, కృష్ణయ్య, జంగయ్య, నీలయ్య, చంద్రయ్య, చెన్నయ్య, శివ, మహేందర్ పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ పరికరాలు తప్పనిసరి

చేవెళ్ల: కంపెనీలలో తప్పనిసరిగా నిబంధనల ప్రకారం ఫైర్‌సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని చేవెళ్ల ఫైర్‌స్టేషన్ అధికారి భిక్షపతి యాజమానులకు సూచించారు. మండలంలోని అనెక్స్ గ్లాస్ కంపెనీ వద్ద అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పెట్రోల్ బంక్‌లు, కంపెనీల వద్ద జరిగే అగ్నిప్రమాదాల నివారణపై సిబ్బందికి అవగాహన కల్పించటంతో పాటు వాటిని చేసి చూపించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వాటిని నివారించేందుకు తగిన పనిముట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. భారీ ప్రమాదాలు జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

ఉక్కిరి బిక్కిరి..!

- ప్రజారోగ్యానికి కుంపటిలా సీసం బట్టీలు
- కలుషితమవుతున్న భూగర్భ జలాలు
- మామూళ్ల మత్తులో అధికారులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా కొనసాగుతున్న సీసం బట్టీలతో ప్రజారోగ్యానికి ముంపు పొంచి ఉంది. జల్‌పల్లి పార్థివాడ, శ్రీరాం కాలనీలలో ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నగరంలో పాడైన బ్యాటరీ, స్క్రాప్ నుంచి బ్యాటరీలు తీసుకొచ్చి ఇక్కడ వాటిని ధ్వంసం చేసి అందులోని సీసాన్ని కరిగిస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ పెద్ద ఎత్తున కాలుష్యం ఏర్పడుతుంది. ఇవి వెలువడే సమయంలో దట్టమైన పొగ స్థానికులను శ్వాస తీసుకోకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సమస్య తీవ్రతను గుర్తించిన ప్రజలు మున్సిపాలిటీ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం ఉండడం లేదు. తొమ్మిదేళ్ల క్రితం గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఒకట్రెండు పర్యాయాలు దాడులు చేసి సీసం బట్టీలను ధ్వంసం చేశారు. ఐదేళ్ల క్రితం పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ కఠినంగా వ్యవహరించడంతో కొన్నాళ్ల పాటు స్తబ్దంగా ఉన్న నిర్వాహకులు ఆయన బదిలీ అనంతరం తిరిగి తమతమ కార్యకలాపాలను ముమ్మరం చేస్తున్నారు. చట్టప్రకారం తప్పని తెలిసినా పరిశ్రమలను మాత్రం కొనసాగిస్తూనే ఉన్నారు. రాత్రయితే చాలు అక్కడ వెలువడే పొగతో కాలనీల వాసులు సతమతమవుతున్నారు. దీంతో శ్రీరాం కాలనీ వాసులు గురువారం తెల్లవారుజామున కూడా ఆయా కంపెనీలను ముట్టడించారు. వెంటనే మూసేయ్యాలని లేకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కలుషితమవుతున్న భూగర్భ జలాలు

జల్‌పల్లి, శ్రీరాం కాలనీలలో కొనసాగుతున్న సీసం బట్టీలతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. కాలం చెల్లిన బ్యాటరీలను ధ్వంసం చేసి అందులో నుంచి సీసాన్ని బట్టీల ద్వారా కరగదీసి ద్రవంగా మార్చే క్రమంలో పెద్ద ఎత్తున రసాయన వ్యర్థాలను భూమిలోకి వదులుతున్నారు. ఈ కారణంగా శ్రీరాం కాలనీలో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడి బోర్లలో మొదటి 10నుంచి 15 నిమిషాల పాటు నీరు రంగు మారి వస్తుండడంతో ఇక్కడి ప్రజలను ఆందోళనకు గురి చేస్తుంది. దీంతో పాటు సీసాన్ని కరిగించే సమయంలో క్యాడ్మీయం, లెడ్ కరిగి దాని వ్యర్థాలు కూడా దుమ్ము రూపంలో పొగలో కలిసి కాలనీల్లో పడుతుంది. ఇలా వచ్చిన రసాయనాలతో కూడిన దుమ్ము ఇళ్లల్లోని నీటి సంప్, ఇతర నీటి నిల్వలలో పడుతుండడంతో స్థానికులు ఇబ్బందికి గురవుతున్నారు.



శ్రీరాం కాలనీలో సీసం బట్టిని ఘెరావ్ చేస్తున్న స్థానికులు

శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు

ప్రతి రోజు రాత్రి 9 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు కొనసాగుతున్న ఈ సీసం బట్టీలు స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దట్టమైన పొగల కారణంగా శ్వాస పీల్చుకోలేక సతమతమవుతున్నారు. ఈ సమస్యతో చిన్నారులు, వృద్ధులు టిబి, క్యాన్సర్, చర్మ వ్యాధులకు గురవుతున్నారు. ఈ విషయమై శ్రీరామ హిల్స్, బృందావన్ కాలనీ, రిలయన్స్ కాలనీల ప్రజలు కంపెనీలపై దాడులు చేసేందుకు కూడా పలుమార్లు విఫలయత్నం చేసినా కంపెనీల నిర్వాహకులే ఎదురు దాడులు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

విమానాలకు సిగ్నల్ సమస్య

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలో ఈ సీసం బట్టీలు కొనసాగుతున్నా అటు మున్సిపాలిటీ అధికారులు గానీ, ఇటు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. మామూళ్ల మత్తులో



కరగదీసిన సీసాన్ని ప్లేట్లలో పోస్తున్న కార్మికులు

జోగుతున్న అధికారులు మిన్నకుండిపోతున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. విమానాశ్రయాలకు కొన్ని కిలోమీటర్ల దూరంలోనే కొన్నిసార్లు అధికారులు పొగను పైకి విడుస్తూ సిగ్నల్‌ను ఇవ్వడం జరుగుతుందన్నారు. దాని ఆధారంగా విమానాల ల్యాండింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. కాని ఇక్కడ విమానాశ్రయానికి ఒకట్రెండు కిలోమీటర్ల దూరంలో ఇలాంటి అక్రమ కంపెనీల ద్వారా వెలువడుతున్న పొగతో పెను ప్రమాదమే పొంచి ఉంది.



సీసం బట్టి

అనారోగ్యం బారిన వృద్ధులు



సీసం బట్టీల సమస్య తమను తీవ్రంగా వేధిస్తుంది. ముఖ్యంగా వయో వృద్ధులకు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. దీంతో వారు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇక్కడ వెలువడుతున్న దట్టమైన పొగను భరించలేకపోతున్నాం. ఈ విషయమై పలుమార్లు కాలుష్య నియంత్రణమండలి అధికారులకు ఫిర్యాదులు చేయడం జరిగింది. ప్రజల ఆరోగ్యానికి చేటు చేసే పరిశ్రమలపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– చంద్రకాంత్ రావు, శ్రీరాం కాలనీ

రాత్రయిందంటే సమస్యలే



రాత్రయిందంటే చాలు సీసం బట్టీల సమస్య ఎక్కువవుతుంది. అధికారులు స్పందించకపోవడంతో ప్రజలందరు కలిసి మూసి వేయించేందుకు మూడు నాలుగు పర్యాయాలు ప్రయత్నించడంతో తాళాలు వేసుకొని జారుకున్నారు. ఒక ఏడాది పాటు స్తబ్దుగా ఉన్న నిర్వాహకులు తాజాగా మళ్లీ మొదలెట్టారు. ఈ సమస్యను భరించలేక ప్రజలు ఇళ్లు అమ్ముకొని వేరే ప్రాంతానికి వెళుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పట్ల చర్యలు తీసుకోవాలి.

– మన్న రవి కుమార్, శ్రీరాం కాలనీ

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

మాజీ ఎంపీపీ అనిత

మొయినాబాద్‌రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానవుడి మనుగడకు ప్రశాంతత కలుగుతుందని మొయినాబాద్ మాజీ ఎంపీపీ ముదిగొండ అనిత శ్రీహరియాదవ్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో గల సాయిబాబా దేవాలయ 5వ వార్షికోత్సవాన్ని వేదపండితులు, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీహరియాదవ్‌లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో గణపతి హోమం, గణపతి పూజతో పూజలు ప్రారంభించి సాయిబాబాకు నూతన వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి మహా మంగళహారతి సమర్పించారు. విచ్చేసిన భక్తులకు స్వామివారి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి గురువారం హిమాయత్‌నగర్‌లో సాయిబాబా మందిరానికి చుట్టుపక్క ప్రాంతాల భక్తులు ఎంతో మంది రావడం అభినందనీయమన్నారు. 5వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో చిన్న మంగళారం ఎంపీటీసీ మల్లేశ్, వివిధ గ్రామాల భక్తులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

చేవెళ్ల: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో దాతలు అందించే సహకారం మరువలేనిదని శంకర్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్ చంద్రమౌళి అన్నారు. మున్సిపల్ పరిధిలోని టీచర్స్ కాలనీలో గురువారం దాత గున్నాల కృష్ణారెడ్డి తాగునీటి కోసం బోరువేయించగా, సంకేపల్లి నర్సింలు బోర్‌మోటార్ అందజేశారు. ఈ బోరును కౌన్సిలర్ చంద్రమౌళి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మున్సిపాలిటీ కూడా కృషి చేస్తోందని చెప్పారు. వేసవిలో నీటి సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. అనంతరం దాతలను అభినందించారు. కాంగ్రెస్ నాయకులు సాత ప్రవీణ్‌కుమార్, రంగారెడ్డి, కాలనీ అధ్యక్షుడు రాంచందర్, కార్యదర్శి సంజీవరావు, ఉన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి

రంజిత్‌రెడ్డికి కరపత్రాలు అందజేత

కందుకూరు: ప్రజాస్వామ్య పరి రక్షణకు కృషి చేయాలని భారత్ జోడో అభియాన్ మహేశ్వరం నియోజకవర్గం ప్రజా సంఘాల నేతలు, డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గండు నర్సింహా, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహా పేర్కొన్నారు. గురువారం జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని కోరుతూ భారత్ జోడో అభియాన్ ముద్రించిన కరపత్రాలు అందజేశారు. మనువాదాన్ని ఓడిద్దాం, రాజ్యాంగాన్ని కాపాడుకుందామనే నినాదంతో ప్రతిఒక్కరూ ఓటు అనే ఆయుధంతో బీజేపీతో యుద్ధం చేయాలని కోరారు. ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము తిరుపతి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొమ్మగళ్ల జంగయ్య, భారత్ జోడో అభియాన్ అసెంబ్లీ కన్వీనర్ కె స్వప్న, అసైన్డ్ భూముల సర్వ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కటికెల శ్రీహరిముదిరాజ్ పాల్గొన్నారు.



రంజిత్‌రెడ్డికి కరపత్రాలు అందిస్తున్న భారత్ జోడో అభియాన్ సభ్యులు

శోభాయాత్ర పోస్టర్ విడుదల

వనస్థలిపురం: హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 23న వనస్థలిపురంలో నిర్వహించనున్న శోభాయాత్ర పోస్టర్‌ను గురువారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 23న సాయంత్రం 4 గంటలకు శోభాయాత్ర వనస్థలిపురంలోని రామాలయం నుంచి ప్రారంభమై పోలీస్‌స్టేషన్, రెడ్ ట్యాంక్, ఎన్జీఓస్ కాలనీ, ఎస్‌కేడీ నగర్ చౌరస్తా, వైదేహినగర్, సాహెబ్‌నగర్‌లోని త్రినేత్ర ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ముగుస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, పార్టీ పలు విభాగాల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, మహిళలు, హనుమాన్ భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు చింతల రవికుమార్, లగ్గోని శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.



శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్

మొయినాబాద్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీమ్‌భరత్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ అన్నా, అక్క, చెల్లె, తమ్ముడు, అవ్వ, తాత చేయి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించిన అనంతరం చిన్నమంగళారం చౌరస్తాలోని మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ పదేళ్ల పాలన, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ కేసీఆర్ పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం మళ్లీ రాబోతుందని ప్రతి పేద వాడికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ ప్రచారంలో ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు మోత్కుపల్లి రాములు, జిల్లా మత్స్యకార సంఘం చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, మండల అధ్యక్షులు మాణయ్య, సంజీవరెడ్డి, దేవరంపల్లి మహేందర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మర్రి రవీందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, చిన్నమంగళారం మాజీ ఉపసర్పంచ్ వాసుదేవ్, ఆంజనేయులుగౌడ్, రాములు, నర్సింగ్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దర్శన్, భీమ్‌భరత్

ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి ఫెన్సింగ్ వేయండి

- వాకర్ల వినతి
- పట్టించుకోని అధికారులు

మీర్‌పేట: కోట్లాది రూపాయలతో చెరువును అభివృద్ధి చేశారు. కానీ ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి ఫెన్సింగ్ వేయలేదు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువును దాదాపు రూ.3.50 కోట్ల వ్యయంతో సుందరీకరణ పనులు చేపట్టారు. ఆర్‌సీఐ రహదారి వైపు వాకింగ్ చేసుకునేందుకు వీలుగా చెరువుపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. స్లాబు వరకు నిర్మించి ఫెన్సింగ్ వేయకుండా అలాగే వదిలేశారు. దీంతో అది ప్రమాదకరంగా ఉందని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్దలతో పాటు చిన్నారులు కూడా వాకింగ్ చేస్తుంటారని, ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీలైనంత త్వరగా ఫుట్ ఓవర్ బ్రిడ్జికి చైన్ లింక్ ఫెన్సింగ్ వేయాలని ప్రజలు కోరుతున్నారు.



మంత్రాల చెరువుపై ఫెన్సింగ్ వేయకపోవడంతో ప్రమాదకరంగా బ్రిడ్జి

ఆదమరిస్తే అంతే...

మీర్‌పేట పెద్ద చెరువు కట్టను ఇటీవల విస్తరించి బీటీ రోడ్డు వేశారు. కట్ట రహదారి ప్రమాదకరంగా ఉండడంతో పాటు ఎటువంటి సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు తెలిపారు. వాహనాలు ఏ మాత్రం అదుపు తప్పినా గుంతలో పడతాయని, ప్రమాదకరంగా ఉన్న చోట సూచికలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్ విజయం ఖాయం

నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల: ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ విజయం సాధించటం ఖాయమని అ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, ఎన్నికల ఇన్‌చార్జి చింపుల సత్యనారాయణ రెడ్డిలు అన్నారు. గురువారం మండలంలోని రావుపల్లి, శంకర్‌పల్లి మండలంలోని మీర్జాగూడ, ఇంద్రారెడ్డినగర్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రావులపల్లిలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నాయకులు పూజలు నిర్వహించి అనంతరం ఇంటింటి ప్రచారం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన జ్యోతిభీంభరత్, మహిళా నాయకురాళ్లు సమత, సరితారెడ్డి, మాజీ సర్పంచ్‌లు శైలజ, రాంచంద్రయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్‌లు గోనే ప్రతాప్‌రెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, డైరెక్టర్ నరేందర్, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌గౌడ్, ఉదయ్‌మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పండగలు మత సామరస్యానికి ప్రతీక

చేవెళ్ల: గ్రామాల్లో ప్రజలు జరుపుకునే ఏ పండగలైనా మత సమరస్యాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని కొత్తపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ ఆసీఫ్ అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహించనున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలకు గురువారం మహ్మద్ ఆసిఫ్ 63వేల రూపాయల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండగలు, ఉత్సవాలు, సంస్కృతి సంప్రదాయాలకు నిలయాలని, అందరూ కలిసి మెలిసి జరుపుకోవాలన్నారు. మహ్మద్ ఆసిఫ్‌ను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు

మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు జరుగుతుందని సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఘట్టుపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ మేకల సాదయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ సావిత్రిలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలు, నిరంకుశత్వం,పెత్తందారి, రాచరిక వ్యవస్థను నిరసిస్తూ బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆరు గ్యారంటీలు, సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలకు ఆకర్శితులవుతున్నారన్నారు. కాంగ్రెస్‌తోనే ప్రజా పాలన సాధ్యమని, మహేశ్వరంలో పూర్వవైభవం తీసుకోస్తామన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నుంచి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరుపోలు రాకేశ్ రెడ్డి, ఘట్టుపల్లి అధ్యక్షుడు యండీ సాబేర్, ఎర్ర యాదగిరి, కుమార్, రాజు, రమేశ్ యండీ మహ్మద్, జల్ల రమేశ్, అంజయ్య పలువురు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న ఘట్టుపల్లి మాజీ సర్పంచ్ మేకల సాదయ్య యాదవ్, మేకల సావిత్రి

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ నుంచి మారుతినగర్ మీదుగా రాజీవ్ గృహకల్ప వరకూ ప్రధాన రహదారి పనులను అధికారులు ప్రారంభించారు. గతంలోనే కిలోమీటర్ మేర ఉన్న ఈ బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. ఇటీవల మారుతినగర్ మెట్రో వాటర్ వర్క్స్ పైప్‌లైన్ల పనులతో అండర్ డ్రైనేజీ పనులు చేపట్టడంతో బీటి రోడ్డు గుంతల మయంగా మారింది. దీంతో అక్కడ కొన్ని నెలలుగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ క్రమంలో స్థానికుల ఫిర్యాదుల అనంతరం ఇబ్బందులను తెలుసుకున్న ఉన్నతాధికారులు మంజూరైన రూ.6 లక్షలతో బీటీ రోడ్డు వేసేందుకు అధికారులు ముందుకొచ్చారు. ఇక్కడ రోడ్డు పనులు పూర్తయితే మారుతినగర్‌లోని ఫేస్ 1, 2, 3తో పాటు రాజీవ్ గృహకల్పకు, అలాగే ఈ మార్గం గుండా నడుస్తున్న ఆర్టీసీ బస్‌లకు, ఇతర వాహనాలకు, పాదాచారులకు పలు కాలనీల వాసులకు రవాణా కష్టాలు తీరనుంది.



ప్రారంభమైన రోడ్డు పనులు